

జిల్లా చీఫ్ జస్టిస్‌ను కలిసిన ఎస్పీ

కోనేరుసెంటర్: కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారికను శుక్రవారం ఎస్పీ ఆర్. గంగాధరరావు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.



మర్యాదపూర్వకంగా..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ పర్యటనకు విచ్చేసిన నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యంను ఎన్టీఆర్ కలెక్టర్ జి.సృజన శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

బాధ్యతల స్వీకరణ



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ లా అండ్ ఆర్డర్ డీసీపీగా గౌతమిశాలి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్క అందజేశారు.

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండాలి



గన్నవరం: జిల్లా వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన రెవెన్యూ డివిజన్ల అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పాడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశం ఉందన్నారు. వాతావరణ శాఖ సూచనలు, హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా కృష్ణానది పరీవాహక ప్రాంతాలు, లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పాకలు, పూరిళ్లలో నివాసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, గర్భిణులు, డయాలసిస్ పేషంట్లను దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలని చెప్పారు. అత్యావసన పరిస్థితుల్లో పంపిణీకి అవసరమైన రేషన్ సరుకులను అందుబాటులో ఉంచాలని అధికారులకు తెలిపారు. రక్షిత మంచినీటి పథకాలకు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. నీటి సమస్యలు రాకుండా స్టోరేజ్ ట్యాంక్‌లు, చెరువులను నింపుకోవాలని తెలిపారు. బలహీనంగా విద్యుత్ స్తంభాలను గుర్తించాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పునరుద్ధరణకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. బలహీనంగా ఉన్న కాలువలు, చెరువు కట్టలను నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై పడిపోయిన చెట్లను తొలగించేందుకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచాలని చెప్పారు.

నేడు పాఠశాలలకు సెలవు

చిలకలపూడి (మచిలీపట్నం): జిల్లాలో జోరున కురుస్తున్న వర్షాల కారణంగా శనివారం పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కృష్ణాజిల్లా విద్యా శాఖాధికారి తాహెరా సుల్తానా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్య (ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు) పాఠశాలలకు సెలవు ప్రకటించామని, ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యా శాఖాధికారులు, అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ ఆదేశాలు అమలు అయ్యేలా చూడాలని కోరారు. ఈ సెలవును వచ్చే ప్రభుత్వ సెలవు రోజుల్లో పాఠశాలలు నిర్వహించేలా చూడాలని సూచించారు.

సరసమైన ధరలకే బియ్యం, కందిపప్పు



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని ప్రజలు ఎక్కువ ధరలకు కొనుగోలు చేయకుండా ప్రభుత్వం నిర్వహించిన ధరలకే కందిపప్పు, బియ్యం విక్రయాలు జరుపుతున్నామని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. జిల్లాలోని తొమ్మిది రైతుబజార్లలో విక్రయాలు జరిపేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కౌంటర్ల ద్వారా స్టీమ్ రైస్ కేజీ రూ. 49, రా రైస్ రూ. 48, కందిపప్పు రూ. 160 అమ్మేలా చర్యలు చేపట్టామన్నారు. రైతుబజార్లతో పాటుగా జిల్లాలోని సూపర్‌మార్కెట్లలో కూడా ఈ ధరకే అమ్మకాలు జరపాలని సంస్థల యాజమాన్యాలను ఆదేశించామన్నారు. మండల కేంద్రంలో కూడా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

అర్చక పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో త్వరలో అర్చక పోస్టుల భర్తీకి నిర్వహించనున్న రాతపరీక్షకు అర్హత ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ మచిలీపట్నం సహాయ కమిషనర్ నేల సంధ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైదిక స్మార్త, శైవ, పంచరాత్ర, వైఖానస, తంత్ర సార, వీర శైవ, చాత్తాద శ్రీ వైష్ణవ, గ్రామ దేవత ఆగమములలో ప్రవేశ, వర, ప్రవర స్థానాలకు ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 16 సంవత్సరాలు నిండి, 5వ తరగతి ఉత్తీర్ణత సాధించి, అర్హత ఉన్న అభ్యర్థులు గురువు వద్ద నుంచి లేదా ధ్రువీకరణ పత్రాలు జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 40 సంవత్సరాల దాటిన వారికి రాత పరీక్ష నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. వారు జనన ధ్రువీకరణ పత్రం జత చేయాలన్నారు. పరీక్ష రుసుము రూ. 100గా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు 6302071530, 08645–273139లో సంప్రదించాలన్నారు.

ప్రకృతి మాతా ప్రణామం

- ఇంద్రకీలాద్రిపై ప్రారంభమైన శాకంబరీ ఉత్సవాలు
- శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన దుర్గమ్మ
- 35 టన్నుల కూరగాయలతో ఆలయ అలంకరణ
- వర్షాన్ని సైతం లెక్క చేయక పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

శతాక్షీదేవికి ప్రణమిల్లిన భక్తజనం

భక్తజనంపై చల్లటి చూపులు ప్రసరిస్తూ.. ముల్లోకాలను కాపాడే దుర్గమ్మ శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సమస్త జనులకు శాకాలతో ఆకలిని తీర్చే శతాక్షీదేవిని భక్తులు ప్రత్యేక పూజలతో మనసారా కొలిచారు. రోజంతా వర్షం కురుస్తూనే ఉన్నా ప్రకృతి మాత దివ్య దర్శనం కోసం పెద్ద ఎత్తున తరలివచ్చారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో పచ్చందాలను సంతరించుకున్న ఇంద్రకీలాద్రిని చూసి మురిసిపోయారు.



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం నుంచి శాకంబరీదేవి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు సాగే ఉత్సవాలలో తొలి రోజు శుక్రవారం కావడంతో సాధారణ భక్తులతో పాటు ప్రముఖులు సైతం అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు, ఆయా దేవాలయాల్లో దేవతా మూర్తులను ఆకుకూరలు, కాయగూరలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులు సైతం పూజా సామగ్రి, కొబ్బరి కాయలకు బదులుగా ఆకుకూరలు, కాయగూరలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మవారి ఆలయానికి సుమారు 35 టన్నుల కూరగాయలతో అలంకరించినట్లు ఆలయ ఈవో కేఎస్ రామరావు పేర్కొన్నారు.



ప్రకృతి రమణీయత నడుమ ఇంద్రగిరిపై కొలువుదీరిన నవదుర్గలు



అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళా భక్తులు

శాస్త్రోక్తంగా వైదిక కార్యక్రమాలు..

ఉత్సవాలను పురస్కరించుకుని విఘ్నేశ్వర పూజ, రుత్విక్ వరుణ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ జరిగాయి. సాయంత్రం కలశస్థాపన, అగ్నిప్రతిష్టాపన, మండపారాధన వంటి వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. తెల్లవారుజామున అమ్మవారికి ఖడ్గమాలార్చన, నిత్య పూజల అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఉదయం నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలి వచ్చి అమ్మవారిని శాకంబరీదేవిగా దర్శించుకున్నారు. శాకంబరీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్న భక్తుల ఇంట అన్నపానీయాలకు కొదవ లేకుండా ఉంటుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. ఉత్సవాలలో తొలి రోజున అమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల ఆకుకూరలు, కాయగూరలు, పండ్లతో అలంకరించారు.

కదంబ ప్రసాదం కోసం బారులు

అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో దేవస్థానం కదంబ ప్రసాదాన్ని తయారు చేసి భక్తులకు పంపిణీ చేశారు. నటరాజ స్వామి వారి ఆలయం వద్ద ఉచిత ప్రసాదాల వితరణను ఆలయ ఈవో కేఎస్ రామరావు లాంఛనంగా ప్రారంభించారు. కదంబ ప్రసాదం కోసం బారులు తీరి కనిపించారు. ఉదయం



ప్రత్యేకాలంకరణంలో ఆలయ ప్రాంగణం

నుంచి రాత్రి వరకు భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ప్రసాద వితరణలో ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఏఈవో చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న నవదుర్గలు..

శాకంబరీదేవి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసిన నవదుర్గలు, సింహ వాహనంపై కొలువుదీరిన దుర్గమ్మతో పాటు వంకాయలతో తీర్చిదిద్దిన శివలింగం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సింహవాహన దుర్గ, శివలింగం వద్ద ఏర్పాటు చేసిన కరివేపాకు తోట భక్తులకు మరింతగా ఆకట్టుకుంది. ఉదయం నుంచి కురుస్తున్న వర్షాన్ని సైతం భక్తులు లెక్క చేయకుండా ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. శాకంబరీదేవి ఉత్సవాలను పురస్కరించుకుని మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరిం చారు.

35వేల కిలోల కూరగాయలు వితరణ

ఏలూరుకు చెందిన సురేష్ వెయ్యి కిలోల కూరగాయలు, తాడేపల్లిగూడెంకు చెందిన పెద్దిరాజు 3 వేల కిలోలు, తణుకుకు చెందిన కొత్తపల్లి రామచంద్రరావు 2 వేల కిలోల కూరగాయలను అందించారు. అలాగే సిద్ధాంతంకు చెందిన ఆర్‌ఎస్ సాయి 1500 కిలోలు, మడికి చెందిన దుర్గాప్రసాద్ 1500 కిలోలు, కొత్తపేటకు చెందిన రెడ్డియ్య 2 వేల కిలోలు, హనుమాన్‌జంక్షన్‌కు చెందిన కాశీ 3 వేల కిలోలు, చిన్న ఓగిరాలకు చెందిన దోనేపూడి శివాజీ, మరీదు శివశంకర్ 1500 కిలోలు, పెద్ద ఓగిరాల అన్నం సుబ్బారావు, శివారెడ్డి వెయ్యికిలోల కూరగాయలను వితరణ చేశారు. ఉయ్యూరు సుధీర్ టింబర్ డిపో 500 కిలోలు, యడ్లపల్లికి చెందిన కేశినేని వెంకటేశ్వరరావు, అలపాటి గంగాధరరావు 3వేల కిలోలు, సంగం జాగర్లమూడికి చెందిన శ్రీనివాస్ వెయ్యి కేజీలు, విజయవాడ గాంధీజీ మార్కెట్‌కు చెందిన ముత్యాలరావు 2 వేల కిలోలు, ఆర్ ఎస్‌ఆర్, రాజేష్ రెండు వేల కిలోలు, గుంటూరు కూరగాయల మార్కెట్‌కు చెందిన బ్రహ్మానాయుడు రెండు వేల కిలోలు, శివయ్య, బాబులు రెండు వేల కిలోల ఆకుకూరలు, గుంటూరు చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన ఆంజనేయులు 500 కిలోలు, గుంటూరు సాంబిరెడ్డి వెయ్యి కిలోలు, ఎస్. నరేంద్రకుమార్, నారాకోడూరు, చేబ్రోలు, తెనాలికి చెందిన బి. శ్రీనివాస్‌రావు, రంగయ్య, ఫణీంద్రబాబు 3 వేల కిలోలు, విజయవాడకు చెందిన చదలవాడ కృష్ణదాస్, భక్తవత్సల సేవా సమితి తదితరులు కూరగాయలను అందించారు.



ప్రజా భాగస్వామ్యంతోనే వ్యాధులకు అడ్డుకట్ట

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయాలన్నా.. ఆరోగ్యకర సమాజ నిర్మాణం జరగాలన్నా.. అది ప్రజా భాగస్వామ్యంతోనే సాధ్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. 30వ డివిజన్ రామకృష్ణాపురంలో విజయవాడ నగరపాలక సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తదితర విభాగాల ఆధ్వర్యంలో ఫ్రైడే–డ్రైడేలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. నీటి నిల్వలు, బుడమేరు తదితర ప్రాంతాలలో దోమల నివారణ చర్యలను పరిశీలించి సూచనలు చేశారు. దోమల నియంత్రణకుగానూ నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులకు కారణం దోమ అని అటువంటి దోమల నియంత్రణకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ సృజన, డీఎంహెచ్‌ఓ సుహాసిని తదితరులు

అవగాహన అవసరం..

ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని.. వీటి బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం రెండు మూడు నెలలపాటు జన జాగృతి, ర్యాలీలు వంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బుడమేరులో నీటి ప్రవాహం సరిగా ఉండేలా ప్రత్యేక యంత్రాల సహాయంతో గుర్రపు డెక్క, తూటికాడలను తొలగిస్తున్నామన్నారు. వర్షపునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూసి.. వ్యాధులకు కారణమయ్యే దోమల బ్రీడింగ్ సోర్స్(దోమల లార్వా)లను నాశనం చేయడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ ఎ.మహేశ్, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్టులు) కేవీ సత్యవతి, డీఎంహెచ్‌వో డాక్టర్ మాచర్ల సుహాసిని, 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి, వీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, బయాలజిస్టు సూర్య నాయక్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెరగాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

తిరువూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన కోరారు. శుక్రవారం తిరువూరు నియోజకవర్గంలో పర్యటించిన ఆమె స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యాప్రమాణాల పెంపునకు ప్రణాళిక రూపొందిస్తామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీకి, ప్రధానోపాధ్యాయుడికి సూచించారు.

కట్టెలేరు వంతెన నిర్మాణానికి చర్యలు..

గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టెలేరుపై వంతెన పునర్నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విలేకరులకు తెలిపారు. 20 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలకు ఇబ్బంది కరంగా ఉండటమే కాక 40 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని పలువురు తమ దృష్టికి తెచ్చారని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ సృజన వెల్లడించారు. ఏ కొండూరు మండలంలో విషజ్వరాలు ప్రబలుతున్నందున వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని, జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల్ని ఆదేశించామన్నారు. తిరువూరు ఆర్డీవో కొత్తా మాధవి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులతో మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్

తెరిపివ్వని వాన

- కృష్ణా జిల్లాలో 21.9 మిల్లీమీటర్ల నగటు వర్షపాతం నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అల్పపీడన ప్రభావంతో ఎన్టీఆర్ జిల్లాలో గడచిన రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రోజంతా జల్లులు పడుతూనే ఉన్నాయి. రోజంతా వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షాలకు కృష్ణానదికి ఎగువున ఉన్న కట్టలేరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వైరా నది, మునేరులకు వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజ్ వద్ద నీటి మట్టం పెరిగింది. నదికి 6,401 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. బ్యారేజ్ నుంచి కేఈ మెయిన్ కెనాల్‌కు 4,515 క్యూసెక్కులు, కేఈబీ కెనాల్‌కు 702 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 1110 క్యూసెక్కులు, రైవస్ కాలువకు 2,703 క్యూసెక్కులు, కేడబ్ల్యూ మెయిన్ కెనాల్‌కు 1516 క్యూసెక్కుల నీటిని వదిలారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి 17.39 మీటర్లు కాగా ప్రస్తుతం 17.31మీటర్ల వద్ద ఉంది. విజయవాడ నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు జలమయమయ్యాయి. వర్షానికి చాలా వరకు దుకాణాలు తెరుచుకోలేదు. చిరువ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

రాకపోకలు నిలిపివేత..

గంపలగూడెం మండలంలో తోటమూల–వినగడప గ్రామాల మధ్య కట్టలేరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దశాబ్దాల నాడు నిర్మించిన లో లెవల్ కల్వర్టు కొన్నేళ్ల క్రితం వరదలకు పూర్తిగా దెబ్బతింది. ప్రత్యామ్నాయంగా రాకపోకలు సాగించేందుకు బొంగలు ఏర్పాటు చేసి వాటిపై రోడ్డు వేశారు. ప్రస్తుతం వరదకు అది కూడా కొట్టుకుపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో తోటమూల నుంచి వినగడప మీదుగా చీమలపాడు అడ్డ రోడ్డు, విజయవాడకు రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక గ్రామాల ప్రజలు అటువైపు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కల్వర్టుకు రెండు వైపులా ట్రాక్టర్లు అడ్డు పెట్టి రాకపోకలు నిలిపివేశారు.



ఉయ్యూరులో కాలువను తలపిస్తున్న సర్వీస్ రోడ్డు

కృష్ణా జిల్లాలో వర్షపాతం వివరాలు..

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో 21.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం శుక్రవారం నమోదైంది. అత్యధికంగా బంటుమిల్లి మండలంలో 38.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా చల్లపల్లి మండలంలో 10.4 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. జిల్లాలోని మిగిలిన మండలాల్లో వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. కృత్తివెన్ను మండలంలో 36.2 మిల్లీమీటర్లు, పెదపారుపూడి 32.2, మచిలీపట్నం 28.6, మొవ్వ 27.0, గుడివాడ 25.8, నాగాయలంక 24.8, గుడ్లవల్లేరు, పమిడిముక్కల 22.8, గన్నవరం 22.6, కంకిపాడు, నందివాడ మండలాల్లో 22.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. గూడూరు మండలంలో 22.0 మిల్లీమీటర్లు, ఉంగుటూరు 21.8, పెనమలూరు 21.0, బాపులపాడు 20.8 మిల్లీమీటర్లు వర్షం కురిసింది.

పరిశ్రమల ఏర్పాటుకు కృష్ణా జిల్లా అనుకూలం

జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): పరిశ్రమల ఏర్పాటుకు కృష్ణా జిల్లా అనుకూలమైన ప్రాంతమని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహ మండలి సమావేశాన్ని నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రోడ్డు, రైలు, విమాన రవాణా మార్గాలతో పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాను ఎంపిక చేసుకోదగిన ప్రాంతమని ఉత్సాహవంతులు ముందుకు రావాలన్నారు. వీరపనేనిగూడెం, మల్లవల్లి, చల్లపల్లి వంటి ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయన్నారు. బ్యాంకుల్లో రుణాలు మంజూరయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ హర్షవర్ధన్‌కు సూచించారు.

విశ్వ కర్మ యోజనకు దరఖాస్తు చేసుకోండి..

చేతివృత్తుల వారిని ప్రోత్సహించేందుకు 18 రకాల ట్రేడ్లతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా అత్యధికంగా టైలరింగ్, తాపీమేస్త్రీ ట్రేడ్లకు ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు వచ్చాయని వాటిని వెంటనే పరిశీలించాలని ఎంపీడీవోలకు కలెక్టర్ సూచించారు. మిగిలిన ట్రేడ్లలో చేతివృత్తుల వారు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్. వెంకట్రావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతారాం, ఫ్యాక్టరీస్ డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సీఆర్డీఏ డెప్యూటీ డైరెక్టర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్కానింగ్ కేంద్రాలు నమోదు చేసుకోవాలి

జిల్లా వైద్యాధికారి గీతాబాయి

పెనమలూరు: చట్టరీత్యా స్కానింగ్ కేంద్రాలను నమోదు చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. ఆమె శుక్రవారం మండల పరిధిలో టాప్‌స్టార్ ఆస్పత్రి, హరీష్ కార్డియాక్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అన్ని స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా పీసీపీ ఎన్డీటీ చట్ట ప్రకారం నమోదు చేసుకోవాలన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే ఐఎంఏ గుర్తింపు రద్దు చేస్తామన్నారు. స్కారింగ్ కేంద్రాలలో అనుమతులు అన్ని తప్పనిసరిగా ఉండాలన్నారు. స్కానింగ్ కేంద్రాలకు వచ్చే గర్భవతుల వివరాలు పూర్తిగా తీసుకుని స్కానింగ్ చేయాలన్నారు. ప్రతి గర్భవతి వివరాలు ఫారం ఎఫ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. లింగ నిర్ధారణ చేయించుకున్న వారి వివరాలు తెలిపితే గోప్యంగా ఉంచి స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యశాలలు, నర్సింగ్ హోమ్స్, డెంటల్ క్లినిక్స్, లాబొరేటరీలు, ఫిజియోథెరపీ క్లినిక్‌లు తప్పనిసరిగా ఏపీ వైద్య, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం 2002 పరిధిలో నమోదు చేసుకోవాలని అన్నారు. అలా నమోదు చేయించుకోని వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యా బోధకుడు బి.రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ ఏవో శ్రీనివాసరావు సస్పెన్షన్

పెడన: మిచాంగ్ తుపాను నష్టపరిహారం విషయంలో చోటు చేసుకున్న అవకతవకలపై విచారణ నిర్వహించిన ఉన్నతాధికారులు తాజాగా పెడన వ్యవసాయశాఖ ఏవో జీవీ శ్రీనివాసరావును సస్పెండ్ చేశారు. పెడన మండలంలో మిచాంగ్ తుపాను నష్టపరిహారంలో అవకతవకలు చోటు చేసుకున్న విషయం ఈ ఏడాది మేలో బహిర్గతమైంది. ఒక ప్రైవేటు వ్యక్తిని కంప్యూటర్ ఆపరేటర్‌గా పెట్టుకోవడం, ఇద్దరు వీఏఏలు, ఒక వలంటీరు పరిహారం రైతుల పేర్లు నమోదు చేయడంలో అవకతవకలకు పాల్పడి అసలైన రైతులకు పరిహారం అందకుండా చేశారు. అసలు పంట పొలం లేని వారిని రైతులుగా చూపించి సుమారు రూ.50 లక్షలకు పైగా స్వాహా చేశారు. ఈ సంఘటనలపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి జూన్‌లో ఇద్దరు గ్రామ వ్యవసాయ సహాయకులు హరిత, సాద్ అహ్మద్‌లను సస్పెండ్ చేశారు. తాజాగా ఏవోను సస్పెండ్ చేసిన విషయాన్ని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్.పద్మావతి తెలియజేశారు. అసలైన రైతులకు మిచాంగ్ తుపాను నష్టపరిహారం అందుతుందా లేదా ప్రభుత్వం మారింది కదా...వస్తాయంటారా అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు ఇంకా వస్తుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు.

వీడని ఎంపీడీవో అదృశ్యం మిస్టరీ



ఏలూరు వద్ద కాలువలో గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

పెనమలూరు: నరసాపురం ఎంపీడీవో మండల వెంకట రమణారావు అదృశ్యం మిస్టరీ ఇంకా వీడలేదు. గత నాలుగు రోజులుగా పోలీసులు ఏలూరు కాలువలో గాలిస్తున్నా ఆయన ఆచూకీ తెలియలేదు. దీంతో పోలీసులు ఏం చేయాలో తెలియని సందిగ్ధంలో ఉన్నారు. కానూరు మహదేవపురం కాలనీకి చెందిన మండల వెంకట రమణారావు(61) గత ఎన్నికల సందర్భంగా నరసాపురానికి బదిలీ అయ్యారు. ఆయన అక్కడ విధులు నిర్వహిస్తూ కానూరులో కుటుంబ సభ్యుల వద్దకు వచ్చి వెళుతున్నారు. అయితే ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సెలవు పెట్టి కానూరులోనే ఉన్నారు. ఈ నెల 15వ తేదీన మచిలీపట్నంకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కాని 15వ తేదీ అర్ధరాత్రి వాట్సాప్‌లో కుటుంబ సభ్యులకు మెసేజ్ చేసి తాను చనిపోతున్నానని తెలియజేశారు. పని ఒత్తిడి, ఆర్థికపరమైన అంశాలను ఆయన సూసైడ్ నోట్‌లో రాశారు.

ముమ్మరంగా గాలింపు

కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పెనమలూరు పోలీసులు ఎంపీడీవో కోసం ముమ్మర గాలింపు చేపట్టారు.



మధురానగర్ రైల్వే స్టేషన్ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ గంగాధర్‌రావు

గూగుల్ లొకేషన్ ప్రకారం ఎంపీడీవో రమణారావు సెల్‌ఫోన్ సిగ్నల్ 15వ తేదీ అర్ధరాత్రి విజయవాడ మధురానగర్ ఏలూరు కాలువ వద్ద నమోదయింది. దీంతో పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, డ్రోన్లతో ముమ్మర గాలింపు చేపట్టారు. ఏలూరు కాలువలో మధురానగర్ నుంచి ఏలూరు వరకు గాలించినా ఎంపీడీవో ఆచూకీ తెలియలేదు. కాలువలో నీరు ఉధృతంగా ఉండటం, పిచ్చి మొక్కలతో కాలువ దారుణంగా మారటంతో గాలింపునకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. సూసైడ్ నోట్ ప్రకారం ఎంపీడీవో కాలువలో దూకి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. చివరి క్షణంలో నిర్ణయం మార్చుకున్నారా అనే కోణంలో కూడా విచారిస్తున్నారు. ఏది ఏమైనా ఎంపీడీవో ఆచూకీ పెద్ద మిస్టరీగా ఉంది.

పోలీసుల గాలింపులో దొరకని ఆచూకీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: అనుమానాస్పదంగా అదృశ్యమైన నరసాపురం ఎంపీడీవో ఎం.వి.రమణారావు ఆచూకీ కోసం హనుమాన్‌జంక్షన్ పోలీసులు శుక్రవారం కృష్ణా-ఏలూరు కాలువలో తీవ్రంగా గాలించారు. సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందాలు బాపులపాడు మండలంలోని వీరవల్లి, పెరికీడుతో పాటుగా ఏలూరు జిల్లాలోని తోటగూడెం, వసంతవాడ గ్రామాల పరిధిలో ఏలూరుకాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.

ఎస్పీ పరిశీలన

పెనమలూరు: ఎంపీడీఓ అదృశ్యం కేసును జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఆయన శుక్రవారం విజయవాడ మధురానగర్ వంతెన వద్దకు వచ్చి చూశారు. నలుగురు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 20 మంది ఎస్ఐలు దాదాపు 250 మంది పోలీసులు గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారని ఎస్పీ తెలిపారు. అన్ని ప్రాంతాల్లో సీసీ పుటేజ్ కూడా పరిశీలిస్తున్నామన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి...

ఎంపీడీఓ రమణారావు అదృశ్యం కేసులో మరో ట్విస్ట్ వెల్లడైంది. రమణారావుకు గత నెల రోజుల నుంచి సైబర్ నేరగాళ్ల నుంచి థ్రెటినింగ్ కాల్స్ వస్తున్నాయని తెలుస్తోంది. ఈ కారణంగానే రమణారావు తన సహచర ఉద్యోగుల వద్ద కొంత సొమ్ము అప్పు తీసుకుని వారికి చెల్లించారని, అయినా ఇంకా వారు ఒత్తిడి చేస్తున్నందువలనే రమణారావు ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

టిడ్కో లబ్ధిదారుల ఆందోళన

- జాతీయ రహదారిపై ధర్నా
- నిలిచిపోయిన ట్రాఫిక్

గుడివాడరూరల్: మౌలిక సదుపాయాలు లేవు, వసతులు లేవు, సమస్యలతో సతమతమవుతున్నామంటూ టిడ్కో లబ్ధిదారులు గురువారం ఆందోళన బాట పట్టారు. గుడివాడ-మచిలీపట్నం-కల్లూరు జాతీయ రహదారిపై గుడివాడ మార్కెట్‌యార్డ్ సమీపంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా టిడ్కో లబ్ధిదారులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడ్కో సముదాయాలకు వచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఎన్నికల్లో గెలిపిస్తే లబ్ధిదారులు చెల్లించాల్సిన రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారని, సముదాయాల వద్ద సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి ఓట్లు వేయాలని కోరారన్నారు. తీరా ఓట్లు వేసి గెలిపించిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారని లబ్ధిదారులు వాపోయారు. సముదాయాల వద్ద ప్రస్తుతం పైప్‌లైన్ పగిలిపోయిందని, దీంతో తాగు, వాడుక నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్య పరిష్కరించే వరకు ఆందోళన విరమించే ప్రసక్తి లేదని రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు ఆందోళన చేస్తున్న లబ్ధిదారులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



ధర్నాతో రహదారిపై నిలిచిపోయిన వాహనదారులు

స్తంభించిన ట్రాఫిక్...

జాతీయ రహదారిపై టిడ్కో లబ్ధిదారులు ధర్నా చేయడంతో గంటసేపు ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక పక్క వర్షం, మరో పక్క రహదారిపై ధర్నాతో వాహనాలు రోడ్లపై ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు అధికారులు ఆందోళన చేస్తున్న లబ్ధిదారులతో చర్చలు నిర్వహించి ధర్నాను విరమింప చేయడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

రేపు చెస్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: అండర్-11 బాలబాలికల చదరంగం జిల్లా జట్లను ఈ నెల 21వ తేదీన విజయవాడ మొగల్రాజపురంలోని గ్లోబల్ చెస్ అకాడమీలో ఎంపిక చేస్తున్నట్లు ది విజయవాడ చెస్ అసోసియేషన్ కార్యదర్శి మందుల రాజీవ్ తెలిపారు. ది విజయవాడ చెస్ అసోసియేషన్, గ్లోబల్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో హాజరైన క్రీడాకారులకు ముందుగా పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేస్తామన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

గన్నవరం: లాభదాయకమైన ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించే దిశగా రైతులను ప్రోత్సహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ విస్తీర్ణాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలు, ప్రోత్సాహాలను అందజేస్తున్నట్లు చెప్పారు. ఆయిల్ పామ్ సాగు ప్రారంభం నుంచే రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహాలను అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ పథకం కింద ఆయిల్‌పామ్ అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ పంట సాగును ప్రోత్సహించి రైతులకు అధిక ఆదాయం సమకూర్చడమే ఈ పథకం లక్ష్యమన్నారు. ముఖ్యంగా సూక్ష్మ సేద్య పద్ధతిలో ఆయిల్ పామ్ సాగు చేసుకునే రైతులకు ప్లాంట్ మెటీరియల్‌ను నూరు శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ సాగు ప్రయోజనాలపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు కృష్ణాజిల్లాలోనే మొదట ప్రారంభమైందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె.జ్యోతి తెలిపారు. జిల్లా రైతులను మరింత ప్రోత్సహించేందుకు ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు ఆయిల్ పామ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా సూక్ష్మ సేద్య పథక సంచాలకులు విజయలక్ష్మి, పతంజలి ఫుడ్స్ కంపెనీ డీజీఎం జి.వీరేంద్రచౌదరి, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

వినియోగదారునికి ధర వ్యత్యాసం చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారునికి వస్తువు ధరలో ఉన్న వ్యత్యాసాన్ని చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మి రాయల శుక్రవారం తీర్పు చెప్పారు. మచిలీపట్నం నగరానికి చెందిన ఓలేటి తరుణ్ సాయి పరాసుపేట అపోలో ఫార్మసీలో నీవీఎం క్రీమ్ 60 ఎంఎల్‌ను ఎమ్మార్పీ రూ.130 ఉండగా బిల్లు రూ.133 తీసుకున్నారు. ఎందుకు ఎక్కువ తీసుకున్నారని తరుణ్‌సాయి ఫార్మసీ వారిని అడిగితే పట్టించుకోలేదు. దీంతో ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారించిన అనంతరం కమిషన్ సభ్యులు ధర వ్యత్యాసం రూ.3, సేవా లోపం, మానసిక వేదనకు రూ.3 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.500 వినియోగదారునికి 30 రోజుల్లోగా చెల్లించాలన్నారు.

పట్టపగలే పెట్రోలు పోసి ఇంటికి నిప్పు

- ఆకునూరు అంబేడ్కర్ నగర్‌లో ఘటన
- పూరిల్లు దగ్ధం
- రూ.5 లక్షల ఆస్తినష్టం




దగ్ధమైన ఇల్లు

ఉయ్యూరు: పట్టపగలే పెట్రోలు పోసి ఇంటికి నిప్పంటించిన ఘటన మండలంలోని ఆకునూరులో జరిగింది. ఆస్తి వివాదమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం ఉయ్యూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని ఆకునూరు గ్రామం అంబేడ్కర్ నగర్‌లో బొంతు ప్రమీల పూరింట్లో నివాసం ఉంటోంది. కడవకొల్లు గ్రామానికి చెందిన బంధువు బొంతు సునీల్‌తో ఆస్తి వివాదం కోర్టులో ఉంది. ఈ నేపథ్యంలో సునీల్ శుక్రవారం ఆకునూరు గ్రామానికి వచ్చి ప్రమీల పూరింటిపై పెట్రోలు పోసి నిప్పంటించాడు. మంటల్లో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న సామగ్రి, 3 కాసుల బంగారు ఆభరణాలు, ఏడు తులాల వెండి ఆభరణాలు, రూ.20 వేలు నగదు అగ్నికి ఆహుతయ్యాయి. పెట్రోలు పోసి నిప్పంటించి పారిపోతున్న సునీల్‌ను గ్రామస్తులు వెంబడించి పట్టుకుని రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనకు కారణమైన సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బాధితురాలు ప్రమీల ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి పక్షాన వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి గారపాటి నాని రూరల్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి న్యాయం చేయాలని కోరారు.

కొసమెరుపు: సునీల్ తల్లి రూరల్ పోలీసుస్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్నట్లు సమాచారం.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

నిందితుడిని అదుపులోకి తీసుకున్న టూటౌన్ పోలీసులు



నిందితుడిని మీడియాకు చూపిస్తున్న టూటౌన్ ఎస్ఐ నాగరాజు

గుడివాడరూరల్: ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలో బంగారపు గొలుసును బలవంతంగా చోరీ చేసిన నిందితుడిని టూటౌన్ పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నైజాంపేటలో ఒంటరిగా నివాసముంటున్న గుడివాడ ధనలక్ష్మి(63) అనే వృద్ధురాలు ఇంట్లో ఉండగా పట్టణంలోని పెద్దవీధికి చెందిన గోకవరపు దిలీప్ బంగారపు గొలుసు బలవంతంగా లాక్కుని పారిపోయాడు. బాధిత వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్ఐ పి.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో దిలీప్ దొంగతనం చేసినట్లుగా రుజువు కావడంతో అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి నిందితుడికి 14రోజులు రిమాండ్ విధించడంతో మచిలీపట్నం సబ్‌జైలుకు తరలించారు.

రికవరీ ఆఫీసర్-II కార్యాలయం

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్

ఆర్థిక సేవల శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం

31-31-21, నారాయణ భవనం, సాయిబాబా స్ట్రీట్, దాబా గార్డెన్స్, విశాఖపట్నం-530 020

టెలిఫోన్ నం. 0891-2957045, ఇ-మెయిల్: ro2.drtvpatnam@gmail.com

అమ్మకం ప్రకటన - సహిత - ఇ-వేలం అమ్మకం ప్రకటన

(ఆదాయ పన్ను చట్టం, 1961 లోని రెండవ షెడ్యూలులో రూల్ 52 (2) చూడండి)

O.A.No.: 10 of 2016 లో R.P.No.: 652 of 2017

1. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SAM బ్రాంచ్-II, కాచిగూడ, హైదరాబాద్ వర్సెస్ మెసర్స్ అగ్రిగోల్డ్ ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహించు దాని మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ ఎ.ఉదయభాస్కర రావు మరియు ఇతరుల మధ్య O.A. No. 10 of 2016లో రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టు బ్యాంక్స్ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993లో సెక్షన్ 19లోని సబ్‌సెక్షన్ (22) క్రింద గౌరవనీయ ప్రిసైడింగ్ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం వారిచే 07.12.2017 తేదీగల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడింది మరియు అమలు కోసం పంపబడింది.
2. రికవరీ సర్టిఫికెట్‌లో నిర్దిష్టపరిచిన రూ.29,17,89,505.03 పై. ([illegible]) తో పాటు వడ్డీ, వ్యయాలు మొ॥వాటిని దిగువ తెలిపిన సర్టిఫికెట్ డెటార్ల నుండి రాబట్టుకునేందుకు R.P. No.652 of 2017 లో ఎగ్జిక్యూషన్ ప్రొసీడింగ్స్ చేపట్టబడినవి.

(1) M/s. అగ్రిగోల్డ్ ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహించు దాని మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ ఎ. ఉదయభాస్కర రావు తండ్రి శ్రీ వెంకట అప్పారావు, డి.నం.4-131/1-6, NH-9, కీసర గ్రామం, కంచికచర్ల మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్. ...CD-1

(2) శ్రీ ఎ. ఉదయభాస్కర రావు తండ్రి శ్రీ వెంకట అప్పారావు, ఇ.నం.23-35-39, పిఎస్‌రావునగర్ వీధి, లక్ష్మీనగర్, సత్యనారాయణపురం, విజయవాడ. ...CD-2

(3) శ్రీ అవ్వ వెంకట రామారావు తండ్రి శ్రీ వెంకట అప్పారావు, ఇ.నం.23-35-39, పిఎస్‌రావునగర్ వీధి, లక్ష్మీనగర్, సత్యనారాయణపురం, విజయవాడ. ...CD-3

(4) శ్రీమతి కొంపల్లి అలివేలుమంగ తాయి భర్త శ్రీ ఎ.వి. రామారావు, ఇ.నం.23-35-39, పిఎస్‌రావునగర్ వీధి, లక్ష్మీనగర్, సత్యనారాయణపురం,విజయవాడ. ...CD-4

(5) మెసర్స్ అగ్రిగోల్డ్ ఫార్మ్స్ ఎస్టేట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహించు దాని మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ ఎ.వి.ఎస్.ఎన్. రావు, అగ్రిగోల్డ్ టవర్స్, 6-3-668/10/4, దుర్గానగర్ కాలనీ, పంజాగుట్ట, హైదరాబాద్. ...CD-5

(6) మెసర్స్ మీరా అర్గానిక్స్ అండ్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహించు దాని మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ ఎ. ఉదయభాస్కరరావు, ఎస్.నం.1, ఎస్సార్ కొండిగాయి రోడ్డు, గుమ్మిడిపూండి, చెంగై, ఎమ్జీఆర్ జిల్లా, తమిళనాడు-601201 ...CD-6

3. 31.05.2017 నాటికి మొత్తం రూ.29,17,89,505.08 పై. ప్లస్ భవిష్యత్ వడ్డీ, రికవరీ ప్రొసీడింగ్స్‌లో అయిన / కాబోయే వ్యయాలు మరియు ఖర్చులు మొ॥వి బకాయిలుగా ఉన్నవి.
4. సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా "Online e-Auction Sale"ను అనుసరించడం ద్వారా రికవరీ సర్టిఫికెట్ సంతృప్తి మేరకు [illegible] దిగువ తెలిపిన సర్టిఫికెట్ డెటార్స్ యొక్క షెడ్యూల్ ఆస్తుల అమ్మకం కోసం దిగువ సంతకందారు ఆదేశించారు. వేలం తేదీలు, బిడ్ ఫారం దాఖలుకు చివరి తేదీ, రిజర్వు ధర, బయానా, బిడ్ పెంపుదల మొత్తం మరియు వేలం సమయం వివరాలు ప్రతీ ఐటం/ ఆస్తి షెడ్యూలుకు ఎదురుగా దిగువ తెలియజేయబడినవి.

బిడ్ కోసం చివరి తేదీ: 26-08-2024 (సా.4.00 గం.) వేలం తేదీ: 28-08-2024

షెడ్యూల్ మరియు ఐటమ్ నం.	విస్తీర్ణం మరియు ఆస్తి వివరాలు	రిజర్వు ధర రూ.	బయానా రూ.	బిడ్ పెంపుదల మొత్తం రూ.	వేలం సమయం*
షెడ్యూలు-'ఎ' లో ఐటమ్ నం.1 నుండి 12	ఎ.21.94 సెంట్లు	15,35,00,000/-	1,53,50,000/-	1,00,000/-	ఉ.11.00 గం. నుండి ఉ.11.30 గం.

* వేలం సమయం:- వేలం ముగింపునకు ముందు ఒకవేళ బిడ్ వేస్తే, ప్రతీదానికి 5 నిమిషాల ఆటోమెటిక్ ఎక్స్‌టెన్షన్ క్లాజ్‌తో అంటే ఇ-వేలం ముగింపు సమయం ప్రతిసారి 5 నిమిషాలు పొడిగించబడుతుంది.

5. అమ్మకం వద్ద, సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా "online e-auction"లో పాల్గొనాలని భావించు కోరడమైనది. సర్వీస్ ప్రొవైడర్ చిరునామా వివరాలు: M/s. C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సంప్రదించాల్సిన వ్యక్తి: శ్రీ ధరణీకృష్ణ, సంప్రదించు నం: 9948182222, ఇ-మెయిల్ ఐడి: andhra@c1india.com
6. ఇ-వేలం అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్ https://www. bankeauctions.com చూడవలసిందిగా కాగోరు పాల్గొనువారు/ బిడ్డర్లకు సూచించడమైనది మరియు తమ బిడ్ ఫారాలు దాఖలు చేసేందుకు మరియు ఇ-వేలం అమ్మకం కార్యకలాపాలలో పాల్గొనుటకు ఇ-వేలంకు సంబంధించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, యూజర్ ఐడి, పాస్‌వర్డ్, సహాయం, విధానం, ఆన్‌లైన్ శిక్షణ మొదలగు వాటి కోసం కూడా సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవలెను.
7. కాగోరు పాల్గొనువారు బయానా మొత్తాన్ని ఇ-వేలం కలెక్షన్ అకౌంట్ నం. 35754767051, SBI SAM Br II No lien A/c. State Bank of India, SAM Branch-II, Hyderabad, IFSC Code: SBIN0018359కు జమఅయ్యేలా RTGS/NEFT/ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ ద్వారా డిపాజిట్ చేయాలి మరియు అవసరమైన వివరాలు అంటే బయానా డిపాజిట్ రుజువు, పాన్ కార్డ్, చిరునామా మరియు ఐడి రుజువుతో పై పట్టికలో తెలిపిన చివరి తేదీన లేదా ఆలోగా ఆన్‌లైన్ బిడ్ ఫారాలు దాఖలు చేయాలి మరియు పై డాక్యుమెంట్ల స్వయం ధృవీకృత కాపీలతోపాటు తగువిధంగా పూర్తిచేసిన బిడ్ ఫారం హార్డ్ కాపీని కూడా రిజిస్టర్డ్ పోస్ట్/ స్పీడ్ పోస్ట్/ కొరియర్ ద్వారా దిగువ సంతకందారుకు 27.08.2024న లేదా ఆలోగా సా.4.00 గం.లోగా చేరేలా పంపాలి. పోస్టల్ జాప్యాలు అంగీకరించబడవు. ఆస్తి యొక్క ప్రతి ఐటమ్ కొరకు బయానా డిపాజిట్ రుజువుతో పాటు విడి బిడ్ ఫారాలు తప్పక దాఖలు చేయాలి.
8. కాగోరు పాల్గొనువారు సవివరమైన నియమ నిబంధనలు, విచారణలు, మార్గదర్శకాలు, షెడ్యూల్డ్ ఆస్తుల తనిఖీ, టైటిల్ డీడ్స్ కాపీలు, పెండింగ్ లిటిగేషన్స్ మరియు ఇతర [illegible] తగినంత జాగ్రత్తగా చదువుకొని, వేలం అమ్మకం క్రింద ఉన్న ఆస్తి టైటిల్ గురించి తమంతటతాము సంతృప్తి చెందేందుకు శ్రీ కె. రవిశంకర్, చీఫ్ మేనేజర్, మొబైల్ నం.98668 55718, శ్రీ డి. మధుసూదన్‌రెడ్డి, మేనేజర్, మొబైల్ నం. 7702227659; ల్యాండ్‌లైన్ నం.లు: 040-29806752, 29807763, ఇ-మెయిల్ ఐడి: sbi.18359@sbi.co.in వారిని సంప్రదించవలసిందిగా కూడా సూచించడమైనది. సదరు ఆస్తి/ ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా" "అక్కడ ఏముంటే అది" మరియు "ఎలాంటి ఫిర్యాదులేని" ప్రాతిపదికన విక్రయించబడుతున్నది/ విక్రయించబడుతున్నాయి మరియు రిజర్వు ధర కంటే తక్కువకు విక్రయించబడవు. దిగువ సంతకందారుచే అమ్మకం ధృవీకరించబడిన గెలుపొందిన బిడ్డరు పేరున ఆస్తిని మరియు సంబంధిత టైటిల్ డీడ్ డాక్యుమెంట్లను బ్యాంక్ యొక్క బ్రాంచ్ హెడ్/ అధీకృత అధికారి అందజేస్తారు.

ఆస్తి స్పెసిఫికేషన్ :: షెడ్యూలు - 'A'

(ప్రతివాది నం.1 అంటే మెసర్స్ అగ్రి గోల్డ్ ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాతినిధ్యం వహించు వారు దాని మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎ.ఉదయభాస్కరరావుకు చెందిన మరియు తనఖా పెట్టిన ఆస్తి)

ఐటమ్ నం.1: (డాక్యుమెంట్ నం.611 ఆఫ్ 2000 తేది: 15.05.2000 కలిగిన రిజిస్టర్డ్ సేల్ డీడ్)

ఆం.ప్ర. కృష్ణా జిల్లా, కంచికచర్ల మండలం, కీసర గ్రామంలో డి.నం.93/2లోని ఎ.2-95 సెంట్ల భూమి మరియు డి.నం.93/1లోని ఎ.0-06 సెంట్ల విస్తీర్ణం గల భూమి మొత్తం ఎ.3-01 సెంట్ల విస్తీర్ణం గల భూమిలో 437 చ.గ. విస్తీర్ణం గల భూమి యావత్తు 680 చ.అ. RCC బిల్డింగ్ మరియు 1వ అంతస్తు RCC శ్లాబ్ విస్తీర్ణం 680 చ.అ. ప్లింత్ ఏరియాతో పాటు ఎలక్ట్రిసిటీ సర్వీస్ మరియు బోర్‌తో కలిపి. ఆస్తి యొక్క డి.నం.1-92/1 **మరియు సరిహద్దులు: ఉత్తరం:** సెజ్‌లో అమ్మకందారుల భూమి, **దక్షిణం:** నేషనల్ హైవే నం.9. **తూర్పు:** అమ్మకందారుల భూమి. **పశ్చిమం:** ఎ.ఎన్.రామారావు మొ॥ వారి భూమి.

ఐటమ్ నం.2: (డాక్యుమెంట్ నం.618 ఆఫ్ 2000 తేది: 16.05.2000 కలిగిన రిజిస్టర్డ్ సేల్ డీడ్)

SRO కంచికచర్ల వద్ద నమోదు కాబడి, ఆం.ప్ర. కృష్ణా జిల్లా, కంచికచర్ల మండలం, కీసర గ్రామంలో గల RS నం.93/1 మరియు 93/2లోని 6713 చ.గ. లేదా 5638.92 చ.మీ. విస్తీర్ణం గల భూమి యావత్తు **మరియు సరిహద్దులు: ఉత్తరం:** కోటపాటి పూర్ణచందర్‌రావుకు చెందిన భూమి, **దక్షిణం:** అమ్మకందారు ఖాళీ భూమి మరియు సెజ్, **తూర్పు:** అమ్మకందారుకు చెందిన భూమి, **పశ్చిమం:** ఎర్ర బండి రోడ్డు.

ఐటమ్ నం.3: (డాక్యుమెంట్ నం.623 ఆఫ్ 2000 తేది: 17.05.2000 కలిగిన రిజిస్టర్డ్ సేల్ డీడ్)

కంచికచర్ల సబ్ రిజిస్ట్రార్ అధికార పరిధిలో ఆం.ప్ర. కృష్ణా జిల్లా, కంచికచర్ల మండలం, కీసర గ్రామం వద్ద గల డి.నం.93/2లోని ఎ.2-95 సెంట్ల భూమి మరియు డి.నం.93/1లోని ఎ.0-06 సెంట్ల విస్తీర్ణం గల భూమి మొత్తం ఎ.3-01 సెంట్ల విస్తీర్ణం గల భూమిలో డోర్ నం.1-92లో రేకులషెడ్‌తో పాటు 755 చ.గ. విస్తీర్ణం గల సివాన భూమి యావత్తు **మరియు సరిహద్దులు: ఉత్తరం:** కొనుగోలుదారులకు చెందిన భూమి, **దక్షిణం:** అమ్మకందారులకు చెందిన ఆస్తి, **తూర్పు:** అమ్మకందారులకు చెందిన భూమి, **పశ్చిమం:** ఎర్ర బండి రోడ్డు మరియు ఇతరులు.

ఐటమ్ నం.4: (డాక్యుమెంట్ నం.629 ఆఫ్ 2000 తేది: 17.05.2000 కలిగిన రిజిస్టర్డ్ సేల్ డీడ్)

కంచికచర్ల సబ్ రిజిస్ట్రార్ అధికార పరిధిలో ఆం.ప్ర. కృష్ణా జిల్లా, కంచికచర్ల మండలం, కీసర గ్రామం వద్ద గల డి.నం.93/2లోని ఎ.2-95 సెంట్ల భూమి మరియు డి.నం.93/1లోని ఎ.0-06 సెంట్ల విస్తీర్ణం గల భూమి మొత్తం ఎ.3-01 సెంట్ల విస్తీర్ణం గల భూమిలో 6713 చ.గ. లేదా 5638.92 చ.మీ. విస్తీర్ణం గల సివాన భూమి యావత్తు **మరియు సరిహద్దులు: ఉత్తరం:** కొనుగోలుదారుల ఆస్తి సరిహద్దు, **దక్షిణం:** నేషనల్ హైవే నం.9, **తూర్పు:** [illegible] మొ॥, **పశ్చిమం:** కొనుగోలుదారుల ఆస్తి సరిహద్దు.

ఐటమ్ నం.5: (డాక్యుమెంట్ నం.835 ఆఫ్ 2002 తేది: 23.05.2002 కలిగిన రిజిస్టర్డ్ సేల్ డీడ్)

కంచికచర్ల సబ్ రిజిస్ట్రార్, కృష్ణా జిల్లా, ఆం.ప్ర. పరిధిలో కంచికచర్ల గ్రామ పంచాయతీ ఏరియా, కీసర గ్రామం వద్ద గల ఎ.3-25 సెంట్ల మొత్తం భూమిలో డి.నం.93/1లో 1.284 హెక్టార్లకు సమానమగు ఎ.3-18 సెంట్ల విస్తీర్ణం గల సెమీ మెట్ట భూమి యావత్తు **మరియు సరిహద్దులు: ఉత్తరం:** కోయ లక్ష్మణరావు దర్శి భాగేశ్వరరావు భూమి, **దక్షిణం:** కొనుగోలుదారుల భూమి, **తూర్పు:** పరిటాల తిరుపతయ్య మరియు పరిటాల గణపతి భూములు, **పశ్చిమం:** కొర పూర్ణచందం భూమి. మరియు కీసర గ్రామంలోని డి.నం.93/2లో 0.048 హెక్టార్లకు సమానమగు ఎ.2-12 సెంట్ల విస్తీర్ణం గల భూమి కూడా **మరియు సరిహద్దులు: ఉత్తరం:** డి.నం.93/1 క్రింద విక్రయించిన భూమి, **దక్షిణం:** నేషనల్ హైవే నం.9, **తూర్పు:** కొనుగోలుదారుల భూమి, **పశ్చిమం:** కొర పూర్ణచందం భూమి.

ఐటమ్ నం.6: (డాక్యుమెంట్ నం.3277 ఆఫ్ 2008 తేది: 18.07.2008 కలిగిన రిజిస్టర్డ్ సేల్ డీడ్)

కంచికచర్ల సబ్ రిజిస్ట్రార్, కృష్ణా జిల్లా, ఆం.ప్ర. కీసర గ్రామ పంచాయతీ పరిధిలో, కీసర గ్రామంలోని డి.నం.103/1లో ఎ.2-04 సెంట్ల (0.816 హెక్టార్లు) విస్తీర్ణం గల సెమీ మెట్ట భూమి యావత్తు **మరియు సరిహద్దులు: ఉత్తరం:** దర్శి భాగేశ్వరావు మరియు బొర్రా తిరుపతయ్య భూమి, **దక్షిణం:** పరిటాల తిరుపతయ్య, గణపతి భూమి, **తూర్పు:** చింతలపూడి నరేంద్ర మొ॥ వారి భూమి, **పశ్చిమం:** అగ్రి గోల్డ్ కంపెనీ ప్రాతినిధ్యం వహించు వారు అవ్వా వెంకట రామారావు భూమి.

ఐటమ్ నం.7: (డాక్యుమెంట్ నం.3989 ఆఫ్ 2008 తేది: 05.09.2008 కలిగిన రిజిస్టర్డ్ సేల్ డీడ్)

కంచికచర్ల సబ్ రిజిస్ట్రార్, కృష్ణా జిల్లా, ఆం.ప్ర. పరిధిలో కీసర గ్రామ పంచాయతీ ఏరియా పరిధిలో, కీసర గ్రామంలోని సర్వే నం.103/3లో ఎ.2-60 సెంట్లు (1.050 హెక్టార్లు) విస్తీర్ణం గల సెమీ మెట్ట భూమి యావత్తు **మరియు సరిహద్దులు: ఉత్తరం:** కొనుగోలుదారుల భూమి, **దక్షిణం:** నన్నపనేని నారాయణమ్మ మొ॥ వారి భూమి, **తూర్పు:** చింతలపూడి నరేంద్ర మొ॥ వారి భూమి, **పశ్చిమం:** కొనుగోలుదారుల భూమి.

ఐటమ్ నం.8: (డాక్యుమెంట్ నం.3659 ఆఫ్ 2008 తేది: 31.07.2008 కలిగిన రిజిస్టర్డ్ సేల్ డీడ్)

కంచికచర్ల సబ్ రిజిస్ట్రార్, కృష్ణా జిల్లా పరిధిలో కంచికచర్ల మండలం, కీసర గ్రామం మరియు గ్రామ పంచాయతీ ఏరియా క్రింద, కీసర గ్రామంలోని RS.నం.94-1లోని ఎ.7-40 సెంట్ల మొత్తం భూమిలో ఎ.1-98 సెంట్ల (0-801 హెక్టార్లు) విస్తీర్ణం గల సెమీ మెట్ట భూమి యావత్తు **మరియు సరిహద్దులు: ఉత్తరం:** పరిటాల వెంకటరావమ్మ భూమి, **దక్షిణం:** కొనుగోలుదారు కంపెనీ భూమి, **తూర్పు:** బొర్రా తిరుపతయ్య భూమి, **పశ్చిమం:** దర్శి భాగేశ్వరావు భూమి.

ఐటమ్ నం.9: (డాక్యుమెంట్ నం.3660 ఆఫ్ 2008 తేది: 31.07.2008 కలిగిన రిజిస్టర్డ్ సేల్ డీడ్)

కంచికచర్ల సబ్ రిజిస్ట్రార్, కృష్ణా జిల్లా పరిధిలో కంచికచర్ల మండలం, కీసర గ్రామం మరియు గ్రామ పంచాయతీ ఏరియా పరిధిలో కీసర గ్రామంలోని RS నం.94/1లోని ఎ.7-40 సెంట్ల మొత్తం భూమిలో ఎ.2-00 సెంట్ల సెమీ మెట్ట భూమి (0-810 హెక్టార్లు) విస్తీర్ణం గల భూమి యావత్తు **మరియు సరిహద్దులు: ఉత్తరం:** చెరుకుమల్లి భాస్కరరావు భూమి, **దక్షిణం:** కొనుగోలుదారు కంపెనీ భూమి, **తూర్పు:** అమ్మకందారు ఎం.1చే దర్శి అన్నపూర్ణమ్మకు కానుకగా ఇచ్చిన భూమి, **పశ్చిమం:** కొనుగోలుదారు కంపెనీ భూమి.

ఐటమ్ నం.10: (డాక్యుమెంట్ నం.3276 ఆఫ్ 2008 తేది: 18.07.2008 కలిగిన రిజిస్టర్డ్ సేల్ డీడ్)

కంచికచర్ల సబ్ రిజిస్ట్రార్, కృష్ణా జిల్లా పరిధిలో కీసర గ్రామ పంచాయతీ ఏరియా పరిధిలో కీసర గ్రామంలోని డి.నం.103/2లోని ఎ.3-00 సెంట్ల (1.212 హెక్టార్లు) విస్తీర్ణం గల సెమీ మెట్ట భూమి యావత్తు **మరియు సరిహద్దులు: ఉత్తరం:** పరిటాల ఏడుకొండలు భూమి, **దక్షిణం:** కాపూరి సరోజిని భూమి, **తూర్పు:** చింతలపూడి నరేంద్రబాబు భూమి, **పశ్చిమం:** అగ్రి గోల్డ్ కంపెనీ ప్రాతినిధ్యం వహించు వారు అవ్వా వెంకట రామారావు భూమి.

ఐటమ్ నం.11: (డాక్యుమెంట్ నం.3215 ఆఫ్ 2008 తేది: 15.07.2008 కలిగిన రిజిస్టర్డ్ సేల్ డీడ్)

కంచికచర్ల సబ్ రిజిస్ట్రార్, కృష్ణా జిల్లా, పరిధిలో కంచికచర్ల మండలం, కీసర గ్రామం మరియు గ్రామ పంచాయతీ ఏరియా పరిధిలో కీసర గ్రామంలోని RS.నం.94/1లోని ఎ.7-40 సెంట్ల మొత్తం భూమిలో ఎ.2-00 సెంట్లు (0-810 హెక్టార్లు) విస్తీర్ణం గల సెమీ మెట్ట భూమి యావత్తు **మరియు సరిహద్దులు: ఉత్తరం:** చెరుకుమల్లి భాస్కరరావు భూమి, **దక్షిణం:** అగ్రి గోల్డ్ భూమి, **తూర్పు:** దర్శి భాగేశ్వరావు భూమి, **పశ్చిమం:** పరిటాల వెంకటేశ్వర్లు భూమి.

ఐటమ్ నం.12: (డాక్యుమెంట్ నం.4848 ఆఫ్ 2008 తేది: 04.12.2008 కలిగిన రిజిస్టర్డ్ సేల్ డీడ్)

SRO కంచికచర్ల వద్ద నమోదు కాబడి, ఆం.ప్ర. కృష్ణా జిల్లా, కంచికచర్ల మండలం, కీసర గ్రామంలో గల ఎ.2.00 సెంట్లు లేదా 0.810 హెక్టార్ల విస్తీర్ణంలో RS నం.103/2లోని వ్యవసాయేతర భూమి మరియు భవనం యావత్తు **మరియు సరిహద్దులు: ఉత్తరం:** పి. వెంకట్రావమ్మ మరియు పి.పెద్ద స్వామికి చెందిన భూమి, **దక్షిణం:** అగ్రి గోల్డ్ ఇండస్ట్రీస్‌కు చెందిన భూమి, **తూర్పు:** డి.పెద్ద గంగయ్యకు చెందిన భూమి, **పశ్చిమం:** అగ్రి గోల్డ్ ఇండస్ట్రీస్‌కు చెందిన భూమి.

(నాచే స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ సీల్‌తో విశాఖపట్నంలో 15 జూలై, 2024న ఇవ్వబడినది)

సం/- (B.N.S.V.S.K. బంగార్రాజు)
రికవరీ ఆఫీసర్-II